క్లుప్తంగా

ఆర్‌బీవీఆర్ మహిళా కళాశాలకు ఏప్లస్ గ్రేడింగ్

కాచిగూడ: రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల నేషనల్ రూరల్ ఇన్‌స్టిట్యూషన్స్ సస్టెనబిలిటీ గ్రేడింగ్ 2022– 23లో చోటు దక్కించుకుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అచ్యుతదేవి తెలిపారు. కళాశాల ప్రాంగణంలో సమిష్టి కృషితో సుస్థిర స్వచ్ఛతను సాధించినందుకు కళాశాలకు ఉపరితల నీటి సంరక్షణ, రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్, రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్ కోసం ఏప్లస్ గ్రేడింగ్, గ్రీన్ కవర్ కోసం ఏ గ్రేడింగ్‌ను సాధించామన్నారు. భవిష్యత్తులో కూడా ఏప్లస్ గ్రేడింగ్‌ను కొనసాగించేందుకు అందరం సమిష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



అధికారులతో కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్

అంబర్‌పేట: గోల్నాక డివిజన్‌ను సమస్యల రహిత డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. జీహెచ్‌ఎంసీ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లోని కమలనగర్, తులసీనగర్, లంకా ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో భాగంగా డివిజన్‌ను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతానన్నారు. వివిధ విభాగాల అధికారులతో పాటు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చదువు, సంస్కారం వారసత్వంగా ఇవ్వాలి




కాచిగూడ: పిల్లలకు ఆస్తి అంతస్తులు కాకుండా మంచి చదువు సంస్కారాలను కూడా వారసత్వంగా ఇవ్వాలని అవే వారి జీవితాలకు పునాదిగా ఉంటుందని శ్రీ చైతన్య స్కూల్ బర్కత్‌పుర ప్రిన్సిపల్ సవిత అన్నారు. శుక్రవారం విద్యార్థుల స్నాతకోత్సవ వేడుకలు పాఠశాలలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్య వలన వినయం, విధేయత, సంస్కారం, సంపద చేకూరుతుందని విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. రమేష్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (60) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



కాచిగూడ: రైలు ఎక్కబోతూ తీవ్రంగా గాయపడిన ఓ గుర్తుతెలియని వ్యక్తి ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎం.చిన్నానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి (30) ఈనెల 17న ఉప్పుగూడ రైల్వేస్టేషన్ వద్ద రైలు ఎక్కుతుండగా తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని 108లో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

24 నుంచి టెక్నోస్మానియా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ టెక్నాలజీ కాలేజీలో ఈ నెల 24 నుంచి టెక్నోస్మానియా–2023 కార్యక్రమం ప్రారంభంకానున్నట్లు ప్రిన్సిపల్ ప్రొ.చింత సాయిలు శుక్రవారం తెలిపారు. నిత్యం తరగతి చదువులు, సెమిస్టర్ పరీక్షలు, ప్రయోగాలతో బిజీగా గడిపే టెక్నాలజీ ఇంజినీరింగ్ విద్యార్థులకు మానసిక ఉల్లాసానికి ప్రతి ఏటా నిర్వహించే టెక్నోస్మానియాకు ఈ ఏడాది కాలేజీ ఆవరణలో ఏర్పాటు పూర్తి చేసినట్లు వివరించారు.మూడు రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

‘దానాల పండుగ రంజాన్’

- ప్రతి రోజు ఐదుసార్లు నమాజ్
- రంజాన్ నెలలో దానధర్మాలు అధికం



కవాడిగూడ: ముస్లింలకు పవిత్ర దినం శుక్రవారం అందులో రంజాన్ మాసంలో చివరి శుక్రవారినికి ఎంతో ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. దీంతో భోలక్‌పూర్, ముషీరాబాద్‌లో ఆధ్యాత్మికత సంతరించుకుంది. చివరి శుక్రవారాన్ని జుమాతుల్ విదా పవిత్ర దినంగా భావిస్తూ ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అధిక సంఖ్యలో ముస్లింలు మసీదులకు వెళ్లి జుమానమాజును ఆచరించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగం చేసుకుని వీడ్కోలు చెప్పుకున్నారు.

- రంజాన్ మాసంలో దానధర్మలు చేయడం ఆనవాయితీ. శుక్రవారం భోలక్‌పూర్‌లోని చారిత్రక జామై మసీదు, ముషీరాబాద్‌లోని ఏక్‌మినార్ మసీదుల్లో చిన్న పెద్ద తేడా లేకుండా ముస్లింలంతా ఉదయయే అధిక సంఖ్యలో మసీదులకు వెళ్లి ఐదుసార్లు ప్రత్యేకంగా నమాజ్ చేశారు.
- ముస్లింలు కఠోర దీక్షతో ఉపవాసాలు ఆచరించడంతో పాటు ఇఫ్తార్ వేళ పండ్లు, ఫలహారాలతో దీక్షను విరమిస్తారు. చివరి శుక్రవారం కావడంతో భోలక్‌పూర్‌లో ప్రత్యేక పండ్ల దుకాణాలు వెలిశాయి. ప్రత్యేకంగా రంజాన్ రోజున తయారు చేసే షీర్‌కుర్మా తయారీకి వినియోగించే సేమియా విక్రయాలు జోరుగా సాగాయి. కిక్కిరిసిన కొనుగోలుదారులతో సందడి నెలకొంది. ఎలాంటి ఆవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముషీరాబాద్ పోలీసులు ప్రత్యేక బందోబస్తును కల్పిస్తున్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట..

- మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ డివిజన్ చేపల మార్కెట్ వద్ద గల మసీదులో ముస్లింలకు రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. పండుగలను పేదలు ఘనంగా నిర్వహించేలా ప్రభుత్వం రంజాన్ కిట్లను పంపిణీ చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని 7 వేల రంజాన్ కిట్లను ముస్లింలకు పంపిణీ చేశామన్నారు. బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.నర్సింగ్‌ప్రసాద్, మాజీ అధ్యక్షులు సయ్యద్ అహ్మద్ భక్తియార్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, నాయకులు శివ ముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, పరశురాంయాదవ్, సదా, గిడియన్ తదితరులున్నారు.

ప్రజల సహకారంతోనే శాంతిభద్రతల పరిరక్షణ..

కవాడిగూడ: ప్రజల సహకారంతోనే శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యమని ముషీరాబాద్ సీఐ జహంగీర్‌యాదవ్ అన్నారు. శుక్రవారం భోలక్‌పూర్‌కు చెందిన ప్రముఖ సంఘ సేవకుడు మహ్మద్ యూసుఫ్‌ఖాన్ ఆధ్వర్యంలో సీఐ జహంగీర్‌యాదవ్ నేరాలను అదుపు చేయడం, శాంతిభద్రతల పరిరక్షణకు అందిస్తున్న సేవలను అభినందిస్తూ.. నిర్వహించిన సభలో జహంగీర్‌యాదవ్‌కు ప్రత్యేక మెమెంటో అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో పోలీసులకు సహకరించాలని సూచించారు. ముషీరాబాద్ పీఎస్ పరిధిలో చైన్‌స్నాచింగ్, దొంగతనాలు, గంజాయి అమ్మకాలు పూర్తిగా నిర్మూలించామన్నారు. భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, మైనార్టీ కమిటీ నాయకుడు రహీం, నాయకులు అజ్మీర్, జావీద్‌ఖాన్ తదితరులున్నారు.



ముషీరాబాద్ సీఐ జహంగీర్‌యాదవ్‌ను సన్మానించిన మహ్మద్ యూసుఫ్‌ఖాన్



చేపల మార్కెట్ వద్ద రంజాన్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఇఫ్తార్‌లో పండ్ల పంపిణీ..

ముషీరాబాద్: రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు ప్రజలలో ఐక్యతను పెంపొందిస్తాయని బీఆర్‌ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని మసీదు వద్ద బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దీన్‌దయాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు సందర్భంగా ముస్లింలకు పెద్ద ఎత్తున పండ్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జైసింహ మాట్లాడుతూ.. గత నెల రోజులుగా ఉపవాస దీక్షలో ఉంటూ ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించడం అభినందనీయమన్నారు. ముషీరాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షులు సయ్యద్ అహ్మద్ భక్తియార్, సీనియర్ నాయకుడు శివ ముదిరాజ్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యక్షులు మోహిన్, ఎయిర్‌టెల్ రాజు తదితరులున్నారు.

అధికారుల ఏర్పాట్లు..



ఎలాంటి అసౌకర్యానికి గురి కాకుండా జీహెచ్‌ఎంసీ, జల మండలి, విద్యుత్, పారిశుద్ధ్య కార్మికులు సౌకర్యాలను కల్పించారు. ఈ రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం తనకు ఉన్న ఆదాయంలో పేదలకు దానధర్మాలు చేయడం జరుగుతుంది. భక్తిభావంతో నెల రోజుల పాటు రంజాన్ ప్రార్థనలు నిర్వహించుకున్నాం.

-రఫీ, దోమలగూడ, ఎస్‌బీఐ కాలనీ

రోజు ఐదుసార్లు నమాజ్ చేస్తాం



రంజాన్ మాసాన్ని అత్యంత పవిత్రంగా పాటిస్తాం. నెల రోజులు కఠోరమైన ఉపావాస దీక్షను ఆచరిస్తాం. తోటి వారికి సాయం చేయడంతో పాటు ఆధ్యాత్మికత కార్యక్రమాల్లో పాల్గొంటాం. ప్రత్యేకంగా ఖురాన్ పఠనంతో పాటు రోజుకు ఐదుసార్లు నమాజ్‌లు చేస్తాం. చిన్ననాటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు పాటిస్తున్నాం. నెల రోజులు మొత్తం ఇంట్లోని వారంతా ఉపవాస దీక్షలు ఆచరిస్తూ పవిత్రంగా ఉంటాం.

– జమాల్,ఎల్బీగూడ

ఉచిత కంప్యూటర్ శిక్షణ.. దరఖాస్తులకు ఆహ్వానం

చిక్కడపల్లి: విద్యార్థులకు ఉచితంగా డీటీపీ కంప్యూటర్ కోర్సులు ఉచితంగా అవని ఫౌండేషన్, తెలంగాణ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కోయ చంద్రమోహన్, వెలుగు శారదలు ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగినవారు ఈ వేసవికే పరిమితం కాకుండా దీర్ఘకాలిక కోర్సులుగా డీటీపీ, ఫోటోషాప్, పేజ్‌మేకర్, క్వార్క్ ఎక్స్‌ప్రెస్, తెలుగు, ఇంగ్లిష్ డీటీపీ, ఎంఎస్ ఆఫీస్ తదితర కోర్సులు కూడా విద్యార్థులు, గృహిణులు, నిరుద్యోగులు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకునేందుకు ఈ కంప్యూటర్ శిక్షణ కోర్సులు ఉపయోగపడతాయన్నారు. కోర్సు అనంతరం ఉపాధి అవకాశాలు కూడా కల్పించబడతాయన్నారు. మే 1 నుంచి ఉచిత తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

త్వరలో సీఎం టోర్నీ: సాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్



ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో పాఠశాల స్థాయి నుంచి క్రీడలకు ప్రాధాన్యతను కల్పిస్తున్నట్లు స్పోర్ట్స్ అథారటీ ఆఫ్ చైర్మన్ తెలంగాణ స్టేట్స్ (సాట్స్) చైర్మన్ డాక్టర్ ఈడిగ ఆంజనేయగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం ఓయూ క్యాంపస్ యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ టెక్నాలజీలో జరిగిన అన్యువల్ స్పోర్ట్స్ డే సెలబ్రేషన్–2023కు కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.చింత సాయిలు అధ్యక్షత వహించగా సాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులను క్రీడల పట్ల ఆకర్షితులను చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 17 వేల క్రీడా ప్రాంగణాలు, స్టేడియాలను నిర్మించినట్లు చెప్పారు. ఇంత వరకు క్రీడ రంగం పై సీఎం కేసీఆర్ రూ. 1200 కోట్లకు పైగ ఖర్చు చేసినట్లు చెప్పారు. సాట్స్ ఆధ్వర్యంలో త్వరలో జరగనున్న సీఎం టోర్నీకి ఓయూ నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనలని విజ్ఞప్తి చేశారు. సాట్స్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా ఓయూకు విచ్చేసిన పూర్వవిద్యార్థి డాక్టర్ ఆంజనేయగౌడ్‌ను ఘనంగా సన్మానించారు.

కోవిడ్ బూస్టర్ డోస్ కేంద్రం ప్రారంభం

కాచిగూడ: కోవిడ్ మొదటి, రెండో డోస్ తీసుకున్న వారు బూస్టర్ డోస్‌ను వేయించుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ అన్నారు. కాచిగూడ, లింగంపల్లిలోని కర్ణాటక సాహిత్య మందిర్‌లో ఏర్పాటు చేసిన కోవిడ్ బూస్టర్ డోస్ సెంటర్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. కరోనా కేసులు రోజురోజుకు పెరుగుతున్నందున వైరస్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు బూస్టర్ డోస్ వేసుకోవాలని కార్పొరేటర్ సూచించారు. ప్రభుత్వం ఉచితంగా బూస్టర్ డోస్ అందిస్తుందని ఆమె పేర్కొన్నారు. డాక్టర్ వసంత, డాక్టర్ పద్మజ, రామలక్ష్మి, రమాదేవి, కర్ణాటక సాహిత్య మందిర్ అధ్యక్షుడు కట్‌గరే, ముకుంద్ కులకర్ణి, రాఘవేంద్ర, సురేంద్ర కులకర్ణి, బీజేపీ నేతలు నర్సింగ్‌రావు, భీమ్‌రాజ్, సూరి, ఎస్.రవియాదవ్, దినేష్, తదితరులున్నారు.



మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

కాచిగూడ: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని తెలంగాణ మున్సిపల్ స్వీపర్ అండ్ కామాటి వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు క్రిష్ణ, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు ఇందిర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ మున్సిపల్ కార్మికులకు కార్మిక చట్టాలను వర్తింప చేయాలని కోరుతూ శుక్రవారం లేబర్ కమిషనర్ కార్యాలయంలో జాయింట్ లేబర్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ కార్మికులు, సిబ్బందిని పర్మినెంట్ చేసేంత వరకు కార్మిక చట్టం ప్రకారం కనీస వేతనం రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నెలసరి వేతనాలు చెల్లించి కార్మికులకు డీఏ, పీఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలను కల్పించాలన్నారు. మేడే సందర్భంగా కార్మిక చట్టాలను అమలు చేయాలని కోరారు. రేణుక, దర్శన్ తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు



టాయిలెట్స్ క్లీనింగ్ మిషన్‌ను అందజేస్తున్న దృశ్యం

కవాడిగూడ: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సేవలందించేందుకు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించిందని బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి సీ.కె.శంకర్‌రావు అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలకు కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి సహకారంతో టాయిలెట్స్ క్లీనర్ ప్రత్యేక మిషన్లను అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచేందుకు ముషీరాబాద్ విద్యా మండలం పరిధిలో ప్రభుత్వ పాఠశాలలకు టాయిలెట్స్ క్లీనర్లను పంపిణీ చేస్తున్నామన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉపాధ్యాయులు బాధ్యతతో వ్యవహరించాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.విశ్వం, బీజేపీ దళిత మోర్చా కార్యవర్గ సభ్యులు నందగిరి నర్సింహ్మా, బీజేపీ మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి చంద్రమోహన్, దళిత మోర్చా ఉపాధ్యక్షులు కృష్ణ, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షులు రవికుమార్, నేతలు నిత్యానంద్, ధర్మేందర రాజు, సత్యనారాయణ తదితరులున్నారు.

హాథ్‌సే హాథ్ జోడో యాత్రను విజయవంతం చేయండి

చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో హాథ్‌సే హాథ్ జోడో యాత్రను చేపట్టి విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి అధ్యక్షతన శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు అందరూ కృషి చేయాలని కోరారు. నాయకులంతా వ్యక్తిగత విభేదాలు పక్కన పెట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి సంకెపల్లి సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు గుర్రం శ్రీనివాసరెడ్డి, సదాశివుడు, మల్లారం శ్రీనివాసరావు, కుట్ల నరసింహయాదవ్, శ్రీపాల్‌రెడ్డి, కొషోర్‌గౌడ్, మంజులరెడ్డి, స్వర్ణమాధవి, రమేష్‌నాయక్, రాజశేఖర్, బండ సురేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, వేణుయాదవ్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న చల్లా నర్సింహారెడ్డి

కాలుష్య రహిత విధానాలతోనే మనుగడ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మానవ తప్పిదాలతో మనుగడ కోల్పోతున్న ధరిత్రిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్సీహెచ్ రంగయ్య పిలుపునిచ్చారు. సమస్త జీవరాశి ఆవాసమైన భూమి అనేక రకాల మానవ నిర్లక్ష్యాల కారణంగా ప్రమాదంలో పడుతుందన్నారు. తద్వారా మానవ సమాజం తీవ్ర ఇబ్బంది పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్–22 ధరిత్రి దినోత్సవం సందర్భంగా శుక్రవారం రంగయ్య బాగ్ లింగంపల్లిలో మాట్లాడారు. ప్రభుత్వాలు, ప్రజలు మూడు సూత్రాల కార్యాచరణతో ధరిత్రిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చెట్లు నాటడం, సంరక్షించడం, ప్లాస్టిక్ వినియోగం ఆపడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం కోసం ప్రతిజ్ఞ పూనాలని పిలుపునిచ్చారు.

ఓయూ కార్యక్రమాలకు మంత్రుల గైర్హాజరు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో జరిగిన వివిధ కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రులు గైర్హాజరయ్యారు. శుక్రవారం ఓయూలో ఏర్పాటు చేసి ఇండో–పసిఫిక్ అధ్యయన కేంద్రం ప్రారంభానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన మహనీయుల జయంతి ఉత్సవాలకు హోంమంత్రి మహ్మద్ అలీతో పాటు మంత్రులు కొప్పుల ఈశ్వర్, సత్యవతిరాథోడ్ హాజరుకావలసి ఉంది. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతో పాటు పెంచిన డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఫీజుల పై విద్యార్థి సంఘాల ఆందోళన కారణంగా మంత్రుల సెక్యురిటీ పై ఇంటలిజెంట్స్ వర్గాల అభ్యంతరంతో గైర్హాజరైనట్లు సమాచారం.

సత్యనారాయణకు ఓయూ డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) విభాగం కాంట్రాక్టు అధ్యాపకులు కాదాసి సత్యనారాయణకు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. సీఎస్ఈ విభాగం అధ్యాపకురాలు ప్రొ.సుజాత పర్యవేక్షణలో ఐడెంటిటీ బెస్ట్ ఎన్క్రిప్షన్ ఆఫ్ డేటా ఫ్రాగ్మెంట్స్ యూజింగ్ హైబ్రిడ్ ఆల్గోరిథం ఇన్ క్లౌడ్ కంప్యూటింగ్ అనే అంశం పై పరిశోధనకు పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. కరీంనగర్ జిల్లా గంగాధర్ మండలం, నారాయణపురం గ్రామానికి చెందిన తొలి గురువు, సోదరుడైన దివంగత కాదాసి వెంకట్‌కు తన డాక్టరేట్ డిగ్రీ అంకితం ఇస్తున్నట్లు సత్యనారాయణ పేర్కొన్నారు.

ఐపీఎల్ ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్న ముగ్గురిపై కేసు

అడ్డగుట్ట: ఐపీఎల్ మ్యాచ్ ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్న ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన మేరకు.. బంజారాహిల్స్‌కు చెందిన శ్రావణ్(33), మారేడుపల్లికి చెందిన విలియమ్స్(34), కృష్ణ(34)లు స్నేహితులు. ముగ్గురూ గురువారం రాత్రి అడ్డగుట్ట బస్టాండ్ వద్ద ఫోన్‌లో ఐపీఎల్ మ్యాచ్ ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్నారు. సమాచారం అందుకున్న నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, తుకారాంగేట్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ముగ్గురినీ అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. అనంతరం, వారి వద్ద నుంచి రూ. 14,500 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు హర్షణీయం

కాచిగూడ: దేశంలోనే ఎక్కడ లేని విధంగా 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని నగరం నడిబొడ్డున ఏర్పాటు చేయడం హర్షణీయమని తెలంగాణ దళిత సేన ప్రతినిధులు అన్నారు. రాష్ట్ర నూతన సచివాలయానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు. శుక్రవారం డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవాల కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా తెలంగాణ దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు పల్లెర్ల వెంకటేశం దళితరత్న అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా దళిత సేన ప్రతినిధులు మంత్రిని కలిసి అభినందించారు. దళితుల సంక్షేమం, అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. దళితుల అభ్యున్నతి కోసం దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తుండడంతో దళితులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. దళితసేన ప్రతినిధులు టి.బాబు, సత్యనారాయణ, నాగమల్లు, చిక్కలపల్లి యాదగిరి తదితరులున్నారు.



పల్లెర్ల వెంకటేశంకు అవార్డును ప్రదానం చేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు



వైభవ్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అంబర్‌పేట: నియోజకవర్గంలో రోడ్ల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శుక్రవారం బాగ్అంబర్‌పేట డివిజన్ వైభవ్‌నగర్ కాలనీలో రూ.10 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేసవికాలం ముగిసేలోపు అంతర్గత రోడ్ల సమస్యను యుద్ధ ప్రాతిపాదికన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే నియోజకవర్గంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లను అభివృద్ధి చేశామన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులతో పాటు స్థానిక బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జీవిత సాఫల్య పురస్కారం ప్రదానోత్సవం

చిక్కడపల్లి: వందల లలిత గీతాలు రాసిన రస హృదయుడు రాము అని రిటైర్డ్ చీఫ్ ఇన్‌కమ్‌టాక్స్ కమిషనర్ నరసింహప్ప అన్నారు. త్యాగరాయగానసభ ప్రధాన వేదికపై అమృత వర్షిణి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శుభోదయం గ్రూప్ సౌజన్యంతో డాక్టర్ ఎం.కె.రాముకు ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జీవిత సాఫల్య పురస్కార ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసమయిరాము సంస్థ స్థాపించి ఎందరో కళాకారులకు వేదిక కల్పించారన్నారు. దూరదర్శన్ విశ్రాంత సంచాలకుడు మధుసూదన్ రావు మాట్లాడుతూ.. రాము వేయికిపైగా లలితగీతాలను రాయగా.. కొన్ని బాలసుబ్రహ్మణ్యం ఆలపించారన్నారు. బోధన్, అసెంబ్లీ ఏసీపీలు కిరణ్ కుమార్, తేజావత్ రామదాసు, నటులు విక్రమ్, శ్రీవాణి, కళాపోషకుడు సూర్యప్రకాష్ తదితరులున్నారు. బండికృష్ణప్రసాద్, లలితారెడ్డి, భాస్కర్, అనూష, ప్రవీణ్ గాయకులు పాడిన పాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

‘గాంధీ’ సూపరింటెండెంట్‌కు పలువురి అభినందన



గాంధీ సూపరింటెండెంట్ రాజారావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్ఎంఓలు

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి సూపరింటెండెంట్‌గా మూడేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న ప్రొఫెసర్ రాజారావును పలువురు వైద్యులు, ఆర్ఎంఓలు, సిబ్బంది అభినందించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పుష్పగుచ్ఛం అందించి, శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. అందరి సహాయసహకారాలతో నిరుపేద రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానని రాజారావు అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ నర్సింహరావు నేత, ఆర్ఎంఓ–1 జయకృష్ణ, లేడీఆర్ఎంఓ పద్మ, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్లు అన్నపూర్ణ, వెంకటరమణ పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383